క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహ స్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

హోమియో మందులు పంపిణీ

భీమునిపట్నం/కొమ్మాది: కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భీమిలిలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో 102 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కలిగొట్ల శ్రీరామ్, డాక్టర్లు పి.జగన్నాథరావు, టి.జి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 8వ వార్డు ఎండాడలో ఆదివారం ఐ క్యూర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 100 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

ప్రజా కవి 'పందిరి'కి సన్మానం

మధురవాడ: అభ్యుదయ, ప్రజాకవి మధురవాడ శివశక్తినగర్‌కి చెందిన పందిరి రాముని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదివారం ఘనంగా సత్కరించారు. మధురవాడ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రాము రచించిన పాటలు 'ప్రజా పాటల పందిరి' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పౌర సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగోతి సూర్యప్రకాశరావు, తాతపూడి ప్రదీప్ కుమార్, మాజీ అధ్యక్షుడు వాండ్రాసి రవికుమార్, ఆశా స్వరూప్, కావ్య రెడ్డి, జెడ్సీ కనక మహాలక్ష్మి, కార్పొరేటర్ మంగమ్మ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతురావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆరు గ్రామాల్లో భూముల రీ సర్వే

పద్మనాభం: మండలంలోని ఆరు గ్రామాల్లో సోమవారం నుంచి భూముల రీ సర్వే చేపట్టనున్నట్లు తహసీల్దార్ తోట శ్రీవల్లి చెప్పారు. మద్ది, బాందేవపురం, పాండ్రంగి, కొవ్వాడ, గంధవరం, నరసాపురం గ్రామాల్లో ఈ రీ సర్వే నిర్వహించనున్నట్టు తెలిపారు. రీ సర్వే చేస్తున్నప్పుడు రైతులు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లు, ఆధారాలు చూపించాలని ఆమె కోరారు.

క్షీణించిన పారిశుధ్యం



ఆర్‌హెచ్ కాలనీలో పేరుకుపోయిన చెత్త

పీఎం పాలెం : స్థానిక ఆర్‌హెచ్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పారిశుధ్యం అధ్వానంగా తయారైందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈగలూ, దోమలు ముసురుతున్నాయని... పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ కేంద్రం బాలలు వాంతులు, విరేచనాలు చేసుకుంటున్నారని వాపోతున్నారు. మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి పారిశుధ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- రూ.61 లక్షలతో పనులు చేపట్టేందుకు శంకుస్థాపన



స్వతంత్రనగర్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు

మధురవాడ: నివాస ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డులోని స్వతంత్రనగర్, మిథిలాపురి వుడా కాలనీ, ఎస్‌జీజీవోస్ కాలనీల్లో పార్కుల అభివృద్ధి, ప్రహరీ నిర్మాణం, గ్రీనరీ, తదితర అభివృద్ధి పనులు జీవీఎంసీ సాధారణ నిధులు రూ.61 లక్షలతో చేపట్టేందుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఇక్కడ తాగునీరు సక్రమంగా అందడం లేదని, వాటర్ ట్యాంకు ఏళ్లు తరబడి శుభ్రం చేయడం లేదని, తాగునీటి పైప్‌లైన్ కాల్వలో లీకైపోవడంతో మురుగునీరుతో కలుషితం అవుతోందని తదితర సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

ఇక్కడ ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన పార్కులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సామాజిక భవనం ఏర్పాటుకు వినతి

మధురవాడ, స్వతంత్రనగర్‌లో పని చేస్తున్న ఆర్‌పీలు ఎస్‌హెచ్‌జీ సమావేశాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు జీవీఎంసీ రిసోర్స్ పర్సన్లు(ఆర్‌పీ)కి సామాజిక భవనం నిర్మించాలని ఎ.రూపాదేవి, శ్రీలత, అరుణ తదితరులు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్సీ కె.కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, ఏపీడీ గంగాధర్, 7వ వార్డు కార్పొరేటర్ పిళ్లా మంగమ్మ, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతురావు, సాంస్కృతిక విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ వంకాయల మారుతీ ప్రసాద్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పెంద్ర అప్పన్న, బెల్లాపు పాపారావు, బంగారు ప్రకాశ్, రైల్వే బోర్డు సభ్యుడు ఎన్.బాబ్జి, తమ్మినేని వరలక్ష్మి, శ్రీదేవి, డాక్టర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలు



కొండపేటలో సరకులు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

తగరపువలస: చిట్టివలస జెడ్పీ హైస్కూల్ 1991 - 92 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం తోటి స్నేహితుల కుటుంబాలకు అవసరమైన సాయం అందించారు. ఇందులో భాగంగా ఇటీవల మరణించిన కొండపేటకు చెందిన వాడ్రా నాగార్జున కుటుంబానికి తమ స్నేహితుడు బడిగంట మహేష్ పుట్టిన రోజును పురస్కరించుకుని బియ్యం, నిత్యావసర సరకులు అందించారు. అలాగే కొత్తపేటకు చెందిన అల్లు గౌరి అస్వస్థతకు గురవగా... మరో స్నేహితుడు గాడి భాస్కర్ కుమార్తె మౌనిషా పుట్టిన రోజును పురస్కరించుకుని రూ.5వేలు సాయం అందించారు. కార్యక్రమంలో చిట్టివలస జెడ్పీహెచ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శిరువూరి శ్రీనివాస వర్మ, ఉపాధ్యక్షుడు హేమ, ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు, కార్యదర్శి పిట్ట శ్రీనివాసరెడ్డి, కోశాధికారి కంబపు శ్రీనివాసరెడ్డి, గౌరవ సలహాదారు గోవాడ సురేష్‌కుమార్, సభ్యులు చెన్నా అప్పలరాజు, సునీల్, పల్ల అప్పారావు, గాడి భాస్కర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



సూర్యకళకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందిస్తున్న సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు

తగరపువలస: భీమిలి మండలం రేఖవానిపాలెం పంచాయతీ రాయపాలెంలో ఆదివారం సమ్మిడి సూర్యకళకు వైఎస్సార్ బీమా పథకం కింద సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు తక్షణ సాయంగా రూ.10 వేలు అందించారు. ఇటీవల సూర్యకళ భర్త గురుమూర్తి అకాల మరణం చెందగా వైఎస్సార్ బీమా పథకం కింద ప్రభుత్వం నుంచి లక్ష రూపాయలు మంజూరవుతాయన్నారు. కార్యక్రమంలో వలంటీర్ ఎం.నూకరత్నం, వార్డు సభ్యుడు ఎం.మహేష్‌వర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సేవారంగం వైపు యువత దృష్టి సారించాలి



పుస్తకాలతో విద్యార్థులు, ఆదర్శ హిందీ ప్రేమీ మండలి ప్రతినిధులు

తగరపువలస: సేవారంగం వైపు యువత దృష్టి సారించాలని ఆదర్శ హిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు కోరారు. తగరపువలసకు చెందిన వెంపాడ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో హిందీ విద్యార్థులకు వెంపాడ శ్రీనివాసరెడ్డి ఆదివారం ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు హిందీ ఫీజులు చెల్లించి, పాఠ్య పుస్తకాలు అందిస్తున్న దాతల సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పర్యటన నేడు

ఆనందపురం : మండలంలోని పలు గ్రామాల్లో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సోమవారం పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం వెల్లంకి జగనన్న కాలనీ వద్ద మంచినీటి పథకం నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి, పెద్దిపాలెంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమాల్లో అధికారులు, పార్టీ నేతలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రోడ్డుపైకి చొచ్చుకొచ్చిన ముళ్ల కంపలు



మరడపాలెం వద్ద భీమిలి రోడ్డుపైకి చొచ్చుకొచ్చిన ముళ్ల కంచెలు



ఏనుగులపాలెం వద్ద రోడ్డుపైకి చొచ్చుకొచ్చిన ముళ్ల కంపలు

వాహన చోదకులకు తప్పని అవస్థలు

ఆనందపురం : మండలంలోని గొట్టిపల్లి నుంచి బోని గ్రామానికి వెళ్లే మార్గంలో రోడ్డుపైకి ముళ్ల కంపలు, తుప్పలు, డొంకలు చొచ్చుకు రావడంతో వాహన చోదకులకు ఇబ్బందికరంగా మారింది. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. లక్షలాది రూపాయల వ్యయంతో రోడ్లు నిర్మిస్తున్నా వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారుతున్నాయి. రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టరు సుమారు ఐదేళ్లపాటు దాని నిర్వాహణ బాధ్యతను తీసుకోవాల్సి ఉంది. కానీ పట్టించుకోవడం లేదు. దీంతో రోడ్డుపై చిన్నపాటి గొయ్యి పడినా పట్టించుకునే వారు కనబడడం లేదు. గొట్టిపల్లి నుంచి బోని వెళ్లే మార్గాన్ని ఇటీవల విస్తరించారు. రోడ్డు కొట్టుకుపోకుండా ఇరువైపులా బెర్ములు ఏర్పాటు చేశారు. అయితే బెర్ముల స్థానంలో ముళ్ల కంపలు, తుప్పలు డొంకలు పెరిగి రోడ్డుపైకి చొచ్చుకొచ్చాయి. దీంతో ఎదురెదురుగా వచ్చే రెండు వాహనాలు తప్పుకోవడానికి పక్కకు వెళ్తే తుప్పలు, ముళ్ల కంపలు తగులుతున్నాయి. దీనివల్ల ద్విచక్ర వాహనదారులు, ఆటోలో ప్రయాణిస్తున్న వారికి ముళ్ల కంపలు తగిలి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పైకి చొచ్చుకొచ్చిన ముళ్ల కంపలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

మరడపాలెం సమీపంలో...

తగరపువలస: రేఖవానిపాలెం పంచాయతీ మరడపాలెం వద్ద భీమిలి రోడ్డుపైకి తుప్పలు చొచ్చుకొస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు గాయాలపాలవుతున్నారు. జీవీఎంసీ పరిధిలో గల్లీ రోడ్డు నుంచి రేఖవానిపాలెం పంచాయతీకి చెందిన బ్యాంకు కాలనీ వరకు ఇరువైపులా ఈ తుప్పల బెడద వాహనదారులను వేధిస్తోంది. భీమిలి జోనల్ అధికారులతోపాటు రేఖవానిపాలెం పంచాయతీ పాలకవర్గం స్పందించి రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు తొలగించాలని భీమిలి ప్రజలు కోరుతున్నారు.

జ్యూట్ క్వార్టర్స్ కూలుస్తారని ఆందోళన

తగరపువలస: చిట్టివలస జ్యూట్ క్వార్టర్స్‌ను సోమవారం నుంచి కూలుస్తారని అందులో నివసిస్తున్న కార్మికుల కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఒకవేళ కూల్చివేత ప్రారంభమైతే అడ్డుకోవడానికి సిద్ధంగా ఉన్నామని చిట్టివలస జ్యూట్‌మిల్లు లాకౌట్ బాధిత సంఘం ప్రకటించింది. కార్మికులకు యాజమాన్యం పూర్తిగా బకాయిలు చెల్లించకపోవడంతో లాకౌట్ బాధిత సంఘం వేసిన కేసులు హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దీనిపై మే నెలలో మిల్లు యజమాని బజోరియాపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయినట్టు బాధిత సంఘం తెలిపింది.

ఇటీవల బజోరియాను న్యాయస్థానం మందలించడంతో మిల్లుతో ఎలాంటి సంబంధం లేదని, తాను ఎప్పుడో మిల్లును, స్థలాలను వేరొకరికి బదిలీ చేసినట్టు తెలిపారని లాకౌట్ బాధిత సంఘం ఆరోపిస్తోంది. అదే జరిగితే ప్రస్తుతం మిల్లు ఆస్తుల బాధ్యులపై అరెస్ట్ వారెంట్ జారీ చేయించేందుకు గట్టిగా ప్రయత్నిస్తామని బాధిత సంఘ కార్మికులు అంటున్నారు.

120 మంది రైతులకు కౌలు కార్డులు

పద్మనాభం: మండలంలో 120 మంది రైతులకు కౌలు కార్డులు జారీ చేయడం లక్ష్యంగా నిర్ణయించినట్టు తహసీల్దార్ తోట శ్రీవల్లి తెలిపారు. పొట్నూరులో పది మందికి, తునివలస, రెడ్డిపల్లి, ఐనాడ గ్రామాల్లో ఒక్కొక్కరికి, గంధవరంలో ఇద్దరికి, కోరాడలో 15 మందికి, అనంతవరం, పాండ్రంగి గ్రామాల్లో 20 మందికి చొప్పున, బాందేవపురం, మద్ది గ్రామాల్లో 25 మంది రైతులకు చొప్పున కౌలు కార్డులు జారీ చేయుటకు లక్ష్యంగా నిర్ణయించినట్టు తహసీల్దార్ తెలిపారు. కౌలు కార్డులు కావాల్సిన రైతులు ఆధారాలతో గ్రామ సచివాలయాల్లో వీఆర్వోలను సంప్రదించాలని ఆమె కోరారు.

సందడిగా సాగరతీరం



రుషికొండ బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

కొమ్మాది: ఆదివారం ఉదయం నుంచి ఉక్కపోత, ఎండతో ఉక్కిరిబిక్కిరి అయిన నగరవాసులు ఉపశమనం కోసం సాయంకాలం సాగరతీరాన్ని ఆశ్రయించారు. సముద్రంలో స్నానాలు చేస్తూ సేదతీరారు. భీమిలి, సాగర్‌నగర్, రుషికొండ బీచ్‌లో ఒక్కసారిగా పర్యాటకుల తాకిడి పెరిగింది.

ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినికి పురస్కారం



మొల్లేటి నిఖితకు పురస్కారం అందిస్తున్న మాజీ డిప్యూటీ మేయర్ సత్యనారాయణ

తగరపువలస: ఇటీవల పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన తగరపువలసకు చెందిన విద్యార్థిని మొల్లేటి నిఖితను అఖిలగాండ్ల తెలుకుల సంక్షేమ సంఘం ఘనంగా సత్కరించి రూ.5వేల నగదు బహుమతి అందించింది. జిల్లా తెలుకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ పురస్కారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తెలుకుల కుటుంబాలను గుర్తించి వారికి అవసరమైన సంక్షేమ పథకాలు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. సంఘం ప్రతినిధులు కల్లేపల్లి కూర్మనాథ్, ఎన్నిటి తాతారావు, బొయిదాపు రామారావు, గొట్టిపల్లి వెంకటరావు, ఎన్నేటి సన్యాసిరావు, వీరవల్లి పెదబాబు, జామి అప్పలరాజు, పీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి 'జగనన్న ఆణిముత్యాలు'కు కేజీబీవీ విద్యార్థినులు





భారతి, రేవతి



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం, మెడల్ అందుకుంటున్న భారతి

ఆనందపురం : మండలంలోని నేల్తేరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ఇచ్చే జగనన్న ఆణి ముత్యాలు అవార్డుకు ఎంపికయ్యారు. మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. ఎస్.భారతి అనే విద్యార్థిని పదో తరగతిలో 600 మార్కులకు 588 సాధించి జిల్లా స్థాయిలో కేజీబీవీ పాఠశాలల విద్యార్థుల్లో టాపర్‌గా నిలిచి రూ.50 వేలు నగదు పురస్కారాన్ని అందుకుంది. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి ముఖ్యమంత్రి చేతులు మీదుగా రూ.75 వేలు నగదు పురస్కారాన్ని అందుకోనుంది. ఈమె నియోజకవర్గ స్థాయిలో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.10 వేలు, పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచినందుకు మరో రూ.3 వేలు నగదు బహుమతి అందుకుంది. అలాగే ఇదే పాఠశాలకు చెందిన ఇ.రేవతి అనే విద్యార్థిని 600 మార్కులకు 585 సాధించి రాష్ట్ర స్థాయిలో తృతీయ స్థానం సాధించి ముఖ్యమంత్రి చేతులు మీదుగా రూ.50 వేలు నగదు బహుమతిని అందుకోనుంది. ఆమె జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి రూ.30 వేలు, పాఠశాలలో ద్వితీయ స్థానం సాధించి రూ.2 వేలు చొప్పున నగదు బహుమతి అందుకున్నారు. ఈ సందర్భంగా విద్యాలయం ప్రత్యేకాధికారి చంద్రకళ మాట్లాడుతూ ఇక్కడి విద్యార్థులు రాష్ట్ర స్థాయి అవార్డులకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విద్యా రంగంలో చేపట్టిన మార్పులు వల్లే ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని చెప్పారు. ఈ మేరకు విద్యార్థులను పలువురు అభినందించారు.

సర్వ రోగ నివారిణి యోగా

అల్లిపురం: యోగా సర్వరోగ నివారిణిగా పని చేస్తుందని ప్రజాపిత బ్రహ్మ కుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రతినిధి బీకే రాజేశ్వరి అన్నారు. ఆదివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆరు ముఖ్యమైన యోగాసనాలు, రెండు రకాల ప్రాణాయామాలను వివరించారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ యోగా ద్వారా ఆరోగ్య పరిరక్షణ సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో ఓం యోగా కేంద్రం ప్రతినిధి రమేష్, శాంతి యోగా కేంద్రం ప్రతినిధి సుబ్బారావు, బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతినిధులు లలితాదేవి, వేణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేణు ఆసనాలు ప్రదర్శించారు.

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు

వుడా కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం



మిథిలాపురి వుడా కాలనీలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు

మధురవాడ: గత ప్రభుత్వాల్లో ఏ సమస్య వచ్చినా... సంక్షేమ పథకాలు కావాలన్నా నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సివచ్చేదని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకులనే ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసం గడప గడపకీ పంపిస్తున్నారని, సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ పథకాలను ప్రజల ఇంటి వద్దే అందిస్తున్నారని కొనియాడారు. జీవీఎంసీ 7వ వార్డు పరిధి మిథిలాపురి వుడా కాలనీ, ఎస్‌జీజీవోస్ లే అవుట్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాసరావు నివాసాల వద్దకు వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ద్వారా జరిగిన మేలుకు సంబంధించిన సంక్షేమ పథకాల పత్రాలు అందజేశారు. ఇక్కడి కాల్వల్లోని పూడిక తొలగించడం లేదని, కనీసం చనిపోయిన పందులను కూడా తియ్యడం లేదని ఆయన దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఆయా సమస్యలు పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీవీ ఓజోన్‌లో అనేక ఏళ్లుగా పెండింగ్‌లో ఉండిపోయిన గెడ్డ, కల్వర్టు నిర్మాణ సమస్య సుమారు కోటి రూపాయలు వెచ్చించి పరిష్కరించారని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. బండారు సుధారాణి అనే మహిళ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా వైఎస్సార్ ఆసరా, అమ్మ ఒడి, పింఛన్, ఆరోగ్య శ్రీ, వైఎస్సార్ సున్నా వడ్డీ ద్వారా రూ.5.36 లక్షల లబ్ధి చేకూరిందని ఆమె కోడలు శ్రీలక్ష్మి సంతోషం వ్యక్తం చేశారు. తహసీల్దార్ సనపల రమణయ్య, జెడ్సీ కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షులు పోతిన శ్రీనివాసరావు, పోతిన హనుమంతురావు, నాయకులు పీకేఎమ్ పాత్రుడు, కుడితి రామారావు, ఎమ్‌వీ రమణమూర్తి, మగ్గూరి వెంకటరమణ, బ్రిక్ శ్రీనివాస్, పోతిన శేషు బాబు, శ్రీదేవి, పిళ్లా వెంకటరమణ, అల్లాడ లింగేశ్వరరావు పాల్గొన్నారు.

పందుల స్వైరవిహారం



భీమిలి రోడ్డులో కీతిన్‌పేట వద్ద పందుల గుంపు

తగరపువలస: భీమిలి పట్టణానికి కేవలం కిలోమీటరు దూరంలో పందులు గుంపులుగా రోడ్లపై సంచరిస్తున్నాయి. భీమిలి పట్టణంలో పదుల సంఖ్యలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు ఉన్నందున ఈ మార్గంలో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దేశం నలుమూలల నుంచి భీమిలిలో అందాలను చూడటానికి పర్యాటకులు కూడా వస్తుంటారు. అలాంటి ఈ ప్రదేశంలో రోడ్లపై పందులు నిత్యం కనిపిస్తూ పట్టణవాసులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. భీమిలిని ఆనుకుని ఉన్న రేఖవానిపాలెం పంచాయతీలో పందులను పెంచుతున్నందునే తరచూ అవి భీమిలి పట్టణ పరిధిలోకి ప్రవేశిస్తున్నాయని, ఒక్కోసారి స్థానికులపై దాడులు చేస్తున్నాయని పలువురు వాపోతున్నారు. పందుల జాడ లేకుండా రేఖవానిపాలెం పంచాయతీ, జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రతిభ చూపిన పోలీసులకు ప్రోత్సాహకం





సీపీ నుంచి నగదు ప్రోత్సాహకం అందుకుంటున్న సాయిబాబా, శ్రీను

పద్మనాభం: విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ కుటుంబ సభ్యులను కిడ్నాపర్ల బారి నుంచి కాపాడిన పద్మనాభం పోలీస్ స్టేషన్‌కి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లకు నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ నగదు ప్రోత్సాహకాలు ఆదివారం అందజేశారు. పద్మనాభం పోలీస్ స్టేషన్‌కి చెందిన కానిస్టేబుల్ ఎస్.శ్రీను, హోమ్‌గార్డు వి.సాయిబాబా ఈ నెల 15న ఆనందపురం మండలం పందలపాక వద్ద ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ భార్య జ్యోతి, కుమారుడు శరత్ చంద్ర, ఆడిటర్ జీవీలను కిడ్నాపర్ల బారి నుంచి కాపాడారు. ఈ క్రమంలో కిడ్నాపర్లను పట్టుకున్నారు. దీంతో వీరికి ఒక్కొక్కరికి సీపీ నగరంలోని తన కార్యాలయంలో రూ.5 వేలు చొప్పున నగదు అందజేశారు.